సాక్షి
వికారాబాద్
ఆదివారం ♦ 8 ♦ డిసెంబర్ ♦ 2024



మహిళల అభ్యున్నతికే..

మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 8లో▸



సంక్షేమంపైనే ఫోకస్

రాజకీయాలకంటే సంక్షేమంపైనే దృష్టి సారిస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. 8లో▸



వివరాల నమోదు పూర్తి

దోమ మండలంలో చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే దాదాపు పూర్తి కావచ్చింది. 9లో▸

న్యూస్‌రీల్

10న రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణపై విచారణ

అనంతగిరి: ఎస్సీ వర్గీకరణపై ఈ నెల 10న రంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ విచారణకు హాజరుకాబోతోందని వికారాబాద్ జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి మల్లేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన ఎస్సీ సంఘం నాయకులు, మేధావులు, పార్టీ నాయకులు హాజరై అభిప్రాయాలు చెప్పాలని కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పూడూరు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. శనివారం పూడూరు ప్రధాన కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 66 హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కొత్త రేషన్ కార్డులు రాక, భూ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పింఛను మొత్తం పెంచలేదని, రైతుబంధు ఎప్పుడు ఇస్తారో వారికే తెలియదని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామం నుంచి బీజేపీ తరఫున పోటీ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, సెన్సార్ బోర్డు మెంబర్ మల్లేశ్ పటేల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

రాబోయే రోజుల్లో కాంగ్రెస్ కనుమరుగు

- ఏడాది పాలనలో వారు చేసిందేమీ లేదు
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి

పరిగి: రాబోయే రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు అవుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై శనివారం పరిగి పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గ్యారంటీల పేరుతో మోసం చేసిందన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంతో విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని.. బీజేపీని కోరుకుంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.9 వేల కోట్లతోనే ఇప్పటి వరకు ప్రభుత్వం నడిచిందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ప్రహ్లాద్‌రావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారుతీకిరణ్, కార్యవర్గ సభ్యుడు మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా నాయకుడు ఈశ్వరప్ప, శ్రీనివాస్, పెంటయ్యగుప్తా, సౌమ్యరెడ్డి, మల్లేశ్, రాంచందర్, రాము యాదవ్, నరసింహ, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం సరికాదు

షాద్‌నగర్‌రూరల్: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం కాంగ్రెస్ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ శరత్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఎమ్మెల్యేపై కొందరు సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచనతోనే ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్నారు.



కొడంగల్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో అల్పాహారం వడ్డిస్తున్న ఎంఈఓ రాంరెడ్డి, క్యూలో విద్యార్థినులు

థాంక్యూ.. సీఎం సార్

ఆకలి చదువులకు స్వస్తి



- ప్రభుత్వ పాఠశాలల్లో రుచికరమైన బ్రేక్ ఫాస్ట్
- హరేకృష్ణ ఫౌండేషన్ ద్వారా నిర్వహణ
- 312 స్కూళ్లలోని 28 వేల మంది విద్యార్థులకు ప్రయోజనం
- మొదటి రోజు కొడంగల్ మండలంలో అమలు
- రేపటి నుంచి నియోజకవర్గం మొత్తం పంపిణీ

సాక్షి స్పెషల్

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలందరూ పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే. కూలీ, పొలం పనులకు వెళ్లే తల్లిదండ్రులు ఉదయాన్నే పిల్లలకు అల్పాహారం వండే పరిస్థితి ఉండదు. ఇంట్లో ఉంటే తినడం, లేదంటే ఆకలితో బడి బాట పట్టడం వీరి దినచర్య. ఈ సమస్యకు చెక్ పెట్టాలని సీఎం రేవంత్ రెడ్డి భావించారు. తన నియోజకవర్గాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకుని విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన అల్పాహారం అందించాలని నిర్ణయించారు. కొడంగల్ మండలంలో శనివారం ప్రయోగాత్మకంగా పంపిణీ చేసిన టిఫిన్‌ను విద్యార్థులు ఇష్టంగా తిన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



కొడంగల్: నియోజకవర్గ పరిధిలోని 312 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 28వేల మంది విద్యార్థులకు రోజూ ఉదయం పూట అల్పాహారం అందించడానికి హరే కృష్ణ ఫౌండేషన్ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి రోజు శనివారం కొడంగల్ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని 4,526 మంది విద్యార్థులకు ఇడ్లీ, ఉప్మా, బోండా, సాంబారు, చట్నీ సరఫరా చేశారు. వేడి వేడిగా.. రుచికరంగా ఉండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి అంటూ ఆస్వాదించారు. హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా అందించిన అల్పాహారం అద్భుతంగా ఉందని తెలిపారు. మొదటి రోజు కాబట్టి ట్రయల్‌గా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరఫరా చేసినట్లు హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుంచి పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని అన్నారు.

ప్రారంభించిన రాష్ట్ర మంత్రులు

రాష్ట్ర మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ్మ శుక్రవారం మార్కెట్ యార్డులో నిర్మించిన వంటశాలను ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు పౌష్టికాహారం అందించనున్నారు.

ఉన్నత ఆశయంలో ఆ నలుగురు

పేద విద్యార్థులకు ఉదయం పూట బలవర్ధకమైన అల్పాహారం అందించే పథకం వెనుక నలుగురు వ్యక్తుల కృషి ఉంది. అందులో మొదటి వ్యక్తి సీఎం రేవంత్‌రెడ్డి. ఆయన చొరవతోనే ఈ పథకానికి రూపకల్పన చేశారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీ సత్యగౌర చంద్ర దాస ప్రభూజీ, వయాట్రీస్ సంస్థ సీఎస్‌ఆర్ నిధుల ఇండియా హెడ్ మిచెల్ డొమినికా, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరామ్, తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్‌ల సహకారం ఉంది.

వారం రోజుల మెనూ ఇలా..

సోమవారం	ఇడ్లీ, సాంబార్
మంగళవారం	పూరీ, ఆలూ కుర్మా
బుధవారం	ఉప్మా, సాంబార్, చట్నీ
గురువారం	మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
శుక్రవారం	ఉగ్గాని/పొంగల్, చట్నీ
శనివారం	బోండా, చట్నీ

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో..

బాహుబలి కిచెన్‌లో ఆహారాన్ని వండేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నారు. 15 నిమిషాల్లో వెయ్యి మంది విద్యార్థులకు సరిపడా అన్నం, 2 గంటల్లో 5వేల మంది విద్యార్థులకు సరిపడా సాంబార్ సిద్ధం చేయవచ్చు. ఇడ్లీ తయారీ యంత్రానికి 15 నిమిషాల్లో 1,020 వేడి వేడి ఇడ్లీలను సిద్ధం చేసే సామర్థ్యం ఉంది. పూరీ తయారీ యంత్రం గంటలో 2వేల పూరీలను తయారు చేస్తుంది. వంట కోసం ఉపయోగించే నీటిని ఆర్‌ఓ ప్లాంట్‌లో శుద్ధి చేస్తారు. ఒక బాయిలర్ ప్లాంట్, గ్యాస్ బ్యాంక్, ఎఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వండిన ఆహారం వేడిగా, పరిశుభ్రంగా ఉండడానికి తగిన చర్యలు తీసుకున్నారు.

సామాజిక బాధ్యతగా..

ఈ వంటశాలను తెలంగాణ ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతగా స్వీకరించాయి. వంటశాల నిర్వహణకు పలు ప్రఖ్యాత సంస్థల ఉమ్మడి కృషి ఉంది. రేవంత్ సర్కార్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కేంద్రీకృత వంటశాలను ఏర్పాటు చేసేందుకు 22 వేల చదరపు అడుగుల స్థలాన్ని కేటాయించింది. సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కిచెన్ షెడ్ నిర్మాణానికి ఉదారంగా సహకారం అందించింది. అల్పాహారం తయారు చేసి విద్యార్థులకు అందించడానికి ప్రపంచ ప్రఖ్యాత ఫార్మా కంపెనీ వయాట్రీస్ సంస్థ మొదటి విడతలో రూ.6.50 కోట్లు మంజూరు చేసింది. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రామ్‌ను అమలు చేస్తున్నారు.



బాహుబలి వంటశాల లోపలి భాగం

విరాళాలతో నిర్వహణ

పట్టణంలోని మార్కెట్ యార్డులో నిర్మించిన బాహుబలి వంటశాల ద్వారా అల్పాహారం పంపిణీ చేస్తారు. పథకం బాధ్యతలు హరే కృష్ణ చారిటబుల్ ట్రస్టుకు అప్పగించారు. సీఎస్‌ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో నిర్వహిస్తారు. ఇందులో భాగంగానే ప్రధాన కంపెనీలు తమ ఆదాయం నుంచి కొంత మొత్తాన్ని ఈ పథకానికి కేటాయిస్తాయి. భారీ కంపెనీలకు వచ్చిన లాభాల నుంచి.. కొంతమేర సమాజ హితానికి వెచ్చిస్తాయి. వీటినే సీఎస్‌ఆర్ నిధులు అంటారు. ఇప్పటికే మొదటి విడతలో వయాట్రీస్ ఫార్మా కంపెనీ మొదటి విడతలో రూ.6.4 కోట్ల విరాళం అందజేసింది. తెలంగాణలో పైలెట్ ప్రాజెక్టుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్‌ను ఎంపిక చేశారు.

నిత్యం 28వేల మంది విద్యార్థులకు..

కొడంగల్ మార్కెట్ యార్డులో నిర్మించిన కేంద్రీకృత వంటశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. ఒక నియోజకవర్గంలోని 28వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే అవకాశం తమకు వచ్చిందని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ తెలంగాణ అధ్యక్షుడు శ్రీసత్య గౌర చంద్ర దాస ప్రభుజీ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషితో విద్యార్థులకు నిత్యం న్యూట్రీషనల్ అల్పాహారం అందించే అదృష్టం దక్కిందన్నారు. సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ద్వారా అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, వయాట్రీస్ సంస్థ, సింగరేణి సంస్థల సహకారంతో ఉన్నతమైన ఆశయంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు.



హస్నాబాద్‌లో టిఫిన్ చేస్తున్న విద్యార్థులు

అల్పాహారం బాగుంది



హరే కృష్ణ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న అల్పాహారం బాగుంది. రోజూ క్రమం తప్పకుండా ఇలాగే ఇస్తే బాగుంటుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. ఇప్పటి వరకు మధ్యాహ్న భోజన పథకం మాత్రమే ఉండేది. ఇప్పుడు ఉదయం పూట కూడా విద్యార్థులకు టిఫిన్ ఇస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– శ్రీజన, 8వ తరగతి, జెడ్పీహెచ్‌ఎస్ కొడంగల్

సంతోషంగా ఉంది



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది. ఈ రోజు పెట్టిన ఇడ్లీ, సాంబారు బాగుంది. ఈ పథకానికి రూపకల్పన చేసిన వారికి ధన్యవాదాలు. పేద విద్యార్థులకు ఎంతోగానో ఉపయోగంగా ఉంటుంది. రోజూ ఒక టిఫిన్ చొప్పున ఇవ్వడం సంతోషంగా ఉంది.

– పావని, 8వ తరగతి, కొడంగల్

ఉప్మా, చట్నీ నచ్చింది



మా స్కూల్‌లో ఉదయం పూట పెట్టిన ఉప్మా చట్నీ నచ్చింది. కడుపు నిండా పెట్టారు. మా సారు వాళ్లు మమ్మల్ని లైన్‌లో నిలబెట్టి ఆహారం వడ్డించారు. ఇంట్లో చేసిన దానికంటే బాగుంది. ప్రతి రోజు ఇలా పెట్టాలి. ఉదయం పూట, మధ్యాహ్నం స్కూల్‌లో తినడం వల్ల మంచిగా అనిపిస్తుంది.

– అభినందన్, 3వ తరగతి, హస్నాబాద్

విద్యార్థులకు మేలు



ప్రభుత్వం చేపట్టిన ఈ పథకం వల్ల పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు. పౌష్టికాహారం అందించడం వల్ల విద్యార్థుల్లో ఉత్తేజం పెరుగుతుంది. చదువుపై దృష్టి పెడతారు. గ్రామాల్లోని పేదల ఇండ్లలో ఉదయం పూట సరిపడా ఆహారం లభించదు. ముఖ్యమంత్రి కృషి వల్ల నియోజకవర్గంలోని విద్యార్థులకు మేలు జరిగింది.

– రాంరెడ్డి, ఎంఈఓ, కొడంగల్



వికారాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్

అనంతగిరి: ఆటో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. శనివారం వికారాబాద్‌లో ఆటో యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంబేడ్కర్ విగ్రహం నుంచి ఎన్‌టీఆర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో డ్రైవర్లు నష్టపోయారని.. ఆదుకోవాలని కోరారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.50 వేలు ఇవ్వాలన్నారు. ఆటో రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, జంగయ్య, ప్రశాంత్, నర్సింలు, వెంకట్, రఫీ, మహేందర్, అంజయ్య, రవి, మహేష్, పాండు, మల్లేశ్, దర్శన్, రాజీవ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

షాబాద్: జిల్లాలో గ్రంథాయాల అభివృద్ధికి కృషి చేసి డిజిటలైజేషన్‌కు ప్రాధాన్యత ఇస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో రూ.80లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన భవనాన్ని శనివారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని గ్రంథాలయాలను డిజిటలైజేషన్ చేసేందుకు యోచిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, వాటిని యువత సద్వినియోగం చేసుకుంటూ ఉద్యోగాలు సాధించాలన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీ, మైనార్టీ, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలలు ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తోందని అన్నారు. పోటీ ప్రపంచంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, అధికారులు ప్రతాప్, శ్వేత, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారుల గుర్తింపు కోసం ప్రభుత్వం రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్‌పై శనివారం కలెక్టరేట్‌లో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, తహసీల్దార్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొబైల్ యాప్‌ను వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సర్వే చేయాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి యాప్‌లో వివరాలను ఏవిధంగా పొందుపరచాలి అనే అంశాలను వివరించారు. ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సర్వే చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా అవకతవకలకు పాల్పడినట్లు తేలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ అధికారులు సిరాజుద్దీన్, మహమ్మద్ ఖలీమొద్దీన్, సయ్యద్ మొక్రం బాబా, సాజిద్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వికారాబాద్‌లో నరేందర్‌రెడ్డి విచారణ

కొడంగల్: లగచర్ల కేసులో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని వికారాబాద్ పోలీసులు విచారించారు. చర్లపల్లి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆయనను శనివారం జిల్లా కేంద్రంలోని డీటీసీకి తీసుకువచ్చి న్యాయవాదుల సమక్షంలో విచారణ చేశారు. లగచర్ల ఘటనలో తనకు తెలిసిన విషయాలను నరేందర్‌రెడ్డి పోలీసులకు వివరించినట్లు సమాచారం. రెండు రోజుల కస్టడీ ఉన్న నేపథ్యంలో ఆదివారం ఆయనను విచారణ నిర్వహించి, అనంతరం చర్లపల్లి జైలుకు తరలించనున్నట్లు తెలిసింది.

పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం

పరిగి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవీణ్



సూచనలు ఇస్తున్న వైద్యాధికారి ప్రవీణ్

కుల్కచర్ల: పరిశుభ్రత పాటిస్తే అనారోగ్యం దరి చేరదని పరిగి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవీణ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో పాఠశాల ఉపాధ్యాయ బృందంతో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు, కూరగాయల నిర్వాహణ తదితర అంశాలపై తరగతి ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, చౌడాపూర్ ప్రత్యేకాధికారి జ్యోతి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికే పెద్దపీట



క్యాంటీన్ ప్రారంభోత్సవంలో చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

పరిగి: మహిళా అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను స్థానిక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెడుతున్నా అందులో మహిళలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిందన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ద్వారా మహిళలకు ఉపాధితో పాటు ఆర్థికంగా బలోపేతమవుతారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్ని పథకాల్లో వారిదే పై చేయిగా ఉండాలనే సూచించారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మహిళకు ప్రత్యేక స్థానం కల్పిస్తూ అమ్మ ఆదర్శ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఇందిరమ్మ కమిటీల్లో చోటు.. ఇందిరమ్మ ఇళ్లను సైతం మహిళలకే కేటాయిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ఒక్కటే అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైయినీ కలెక్టర్ ఉమా హారతి, ఎస్సీ కార్పొరేషన్ క్షితిజ, ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60 మంది మహిళలకు కుట్టు మెషిన్లు

మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగేందుకు ప్రజాప్రభుత్వం కృషి చేస్తోందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శనివారం ఆయన కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంపైనే ఫోకస్

- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దళారులను నమ్మి మోసపోవద్దు

తాండూరు రూరల్: రాజకీయాలకంటే సంక్షేమంపైనే ఫోకస్ పెడతానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాల్లో భాగంగా శనివారం మండల పరిధిలోని అంతారం, దస్తగిరిపేట్, అల్లాపూర్, రాంపూర్, గుంతబాసుపల్లి, మిట్టబాసుపల్లి, ఐనెల్లి, కోటబాసుపల్లి, మల్కాపూర్, సంగెం కలాన్, కొత్లాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అటువంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి

నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నా అని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. రూ.వంద కోట్లతో వికారాబాద్-తాండూరు ప్రధాన రోడ్డుకు నిధులు మంజూరు చేయించానన్నారు. రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, రూ.400కోట్లతో నియోజకర్గంలో రోడ్లకు నిధులు తీసుకువచ్చానని గుర్తు చేశారు. కోట్‌పల్లి, జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టలను అభివృద్ధి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నాగప్ప, పురుషోత్తంరెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను, నాయకులు ఉత్తమ్‌చందు, శరణు బసప్ప, గోపాల్‌రెడ్డి, జగదీశ్, రాందాస్, పండరి, మేఘనాథ్‌గౌడ్, కోటి గోపాల్ ఉన్నారు.



తాండూరు రూరల్: అంతారంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

ఎమ్మెల్సీని కలిసిన భారత్ జాగృతి నాయకుడు

షాద్‌నగర్‌రూరల్: నిజామాబాద్ ఎమ్మెల్సీ, భారత్ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఆమె స్వగృహంలో జాగృతి నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎండీ.ముస్తఫా శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారత్ జాగృతి కండువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. రాబోయే రోజులలో భారత జాగృతి అవలంబిస్తున్న విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి జాగృతి సంస్థను మరింత బలోపేతం చేయాలని సూచించినట్లు తెలిపారు. జాగృతి ఆధ్వర్యంలో వృత్తి విద్యా కోర్సుపై శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచనలు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో నాణ్యమైన మందులు, భోజనాన్ని అందిస్తున్నారా అనే విషయాలను తెలుకొని సమస్యలపై పోరాడాలని చెప్పారన్నారు. ఎమ్మెల్సీని కలిసిన వారిలో నాయకులు బాలాజీ ఉదయ్, గూడెం చెన్నయ్య, బాబురాజ్‌నాయక్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

జోరు వాన



హస్నాబాద్ చౌరస్తాలో కురుస్తున్న వర్షం

దుద్యాల్: మండల కేంద్రంతో పాటు పలుగ్రామాల్లో శనివారం జోరు వాన కురిసింది. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఏకధాటిగా రెండు గంటల పాటు వర్షం కురవడంతో గ్రామంలోని రోడ్లు, కాల్వలు నిండుగా ప్రవహించాయి. అకాల వర్షానికి కంది పంటకు నష్టం వాటిల్లుతుందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

చాదర్‌ఘాట్: రెండ్రోజుల క్రితం అజంపురా చమన్ వద్ద గంజాయి మత్తులో పలువురి నడుమ జరిగిన గొడవలో ఒకరు మృతి చెందిన సంఘటనలో నిందితుడి రిమాండ్‌కు తరలించిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు వివరాల ప్రకారం.. గంజాయి మత్తు లో ఇరు వురుఘర్షణపడి అకిల్ (24)ను బండరాయితో హత్య చేసిన ముస్తాఫా (34)ను శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

అత్తాపూర్: పనికి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హసన్‌నగర్ ఇంద్రానగర్‌కు చెందిన జాఫర్‌ఖాన్ (38) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 4వ తేదీన మధ్యాహ్నం పనికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. ఆ తరువాత ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద జాఫర్‌ఖాన్ ఆచూకీ కోసం ప్రయత్నించిన ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. అత్తాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో సంఘటనలో...

ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఓ మహిళ వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ డివిజన్ సిక్‌చానీ ప్రాంతానికి చెందిన సురేందర్‌సింగ్ కుమార్తె మన్‌మీత్ కౌర్ (24)కు 2021 సంవత్సరంలో వివాహం జరిగింది. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా గత రెండు సంవత్సరాలుగా మన్‌మీత్ కౌర్ సిక్‌చానీలోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నెల 5వ తేదీన ఇంట్లో అందరు పడుకున్న సమయంలో ఉదయం 6 గంటలకు ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్ మోసానికి ప్రాణం బలి

- పురుగు మందు తాగిన వ్యక్తి మృతి
- పీరంపల్లిలో విషాదం



పోచిరెడ్డి(ఫైల్)

అనంతగిరి: చిల్లర నాణేలు(సిక్కలు) సేకరించి ఇస్తే పెద్ద ఎత్తున డబ్బులు చెల్లిస్తామని.. ఓ ఆన్‌లైన్ సంస్థ వేసిన ఎరలో చిక్కుకున్న యువకుడు తీరా మోసపోయానని గుర్తించి పురుగుల మందు తాగి మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ మండలం పీరంపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బందెనోల్ల పోచిరెడ్డి(30) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అవివాహితుడైన ఇతనికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. ఇదిలా ఉండగా ఓ ఆన్‌లైన్ సంస్థ నుంచి వచ్చిన ఆఫర్‌తో చిల్లర నాణేలు సేకరిస్తున్నాడు. వాటిని తీసుకునేందుకు కంపెనీ ప్రతినిధులను ఫోన్‌లో సంప్రదించగా రూ.35 వేలు చెల్లించాలని సూచించారు. ఆతర్వాత రూ.లక్షల్లో రిటర్న్ ఇస్తామని చెప్పిన మాటలు నమ్మాడు. అప్పు చేసి డబ్బులు చెల్లించాడు. అయినా నాణేలు సేకరించకపోవడంతో మరోసారి అందుబాటులోకి వచ్చిన సంస్థ ప్రతినిధులను నిలదీశాడు. మరికొంత డబ్బు చెల్లిస్తేనే నాణేలు తీసుకుంటామని చెప్పడంతో మరోసారి కొంత మొత్తం చెల్లించాడు. ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడంతో మోసపోయాయని గుర్తించి, శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం పొలం నుంచి వచ్చిన తల్లి ఇది గమనించి స్థానికులు, కుటుంబ సభ్యుల సహకారంతో వికారాబాద్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పెద్ద మొత్తంలో అవుతున్న ఫీజులు, మందులకు డబ్బులు సర్దుబాటు కాకపోవడంతో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. పోచిరెడ్డి తండ్రి రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. చేతికి అందివచ్చిన కొడుకు కూడా మృతిచెందడంతో తల్లి అనాథగా మారింది. దీంతో గ్రామంలో విషాదం అలుముకుంది.

దివ్యాంగుల సమస్యలు త్వరలో పరిష్కరిస్తాం

మంత్రి సీతక్క

చాదర్‌ఘాట్: దివ్యాంగుల పింఛన్ల పెంపు, ఇతర సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని రాష్ట మంత్రి సీతక్క తెలిపారు. మలక్‌పేట బధిరుల ఆశ్రమ పాఠశాల, మాసాబ్‌ట్యాంక్‌లోని అంధుల పాఠశాల, సరూర్‌నగర్‌లోని వికలాంగుల పాఠశాలలో కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్యతో కలిసి శనివారం ఆమె దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మూగ చెవిటి విద్యార్థులకు కేవలం పదో తరగతి వరకు ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయని త్వరలో ఇంటర్ కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. వికలాంగులకు పింఛన్లు నేరుగా వారి బ్యాంక్ ఖాతాలో వేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ పాల్గొన్నారు.



విద్యార్థులకు దుప్పట్లు అందజేస్తున్న మంత్రి సీతక్క

అమలుకు నోచుకోని గ్యారంటీలు

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు



కుల్కచర్ల నుంచి పరిగికి బయలుదేరిన బీజేపీ శ్రేణులు

కుల్కచర్ల: మోసపూరిత ప్రకటనలతో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తుంది తప్పితే ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు నోచుకోవడం లేదని బీజేపీ రాష్ట కార్యవర్గ సభ్యుడు కరణం ప్రహ్లాదరావు, బీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప అన్నారు. బంగ్లాలో హిందువులపై దాడికి నిరసనగా శనివారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల నుంచి బైక్ ర్యాలీగా పరిగికి బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధికారంలో వచ్చిన నాటి నుంచి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయలేదని.. ఏ ఒక్క మహిళకు రూ.2500 నగదు సాయం ఇవ్వలేదని, గ్యాస్ సబ్సిడి కొందరికి పరిమితం చేశారని అన్నారు. పెన్షన్‌ల పెంపుపై నేటికీ నోరు విప్పడం లేదన్నారు. రైతు భరోసా ఊసే కరువైందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు మారుతి కిరణ్, బీజేపీ కుల్కచర్ల మండల అధ్యక్షుడు సురేష్, చౌడాపూర్ మండల అధ్యక్షుడు బందయ్య, దిశ జిల్లా కమిటీ సభ్యులు జానకీరాం, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సొమ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



అమ్మవారి విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

కుల్కచర్ల: మండల పరిధిలోని ఎర్రగోవింద్ తండాలో కాళికామాత, ఆంజనేయస్వామి వారి విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. శనివారం ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా కాళికామాత, ఆంజనేయస్వామి విగ్రహాలను ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎం పీపీ సత్యమ్మ హరిశ్చందర్, ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఠాణా ఏర్పాటుకు సన్నాహాలు



దుద్యాల్ మండల కేంద్రం

ప్రభుత్వ భవనాలను పరిశీలించిన పరిగి డీఎస్పీ శ్రీనివాస్

దుద్యాల్: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అందులో భాగంగానే పరిగి డీఎస్పీ శ్రీనివాస్ మండల కేంద్రంలో పర్యటిస్తూ తాత్కాలిక భవనాలను పరిశీలించే పనిలో పడ్డారు. మండల కేంద్రంలోని పల్లె దవాఖాన, ఉర్దూ మీడియం పాఠశాలతో పాటు దుద్యాల్ గేట్ సమీపంలోని పతంజలి యోగా ఆశ్రమంలో తాత్కాలికంగా ఠాణా ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విషయం ఎక్కడా బయటకు పొక్కకుండా అధికారులు జాగ్రత్త పడుతున్నారు. ఇందులో భాగంగా డీఎస్పీ శ్రీనివాస్ శుక్రవారం మండల కేంద్రంలోని పల్లె దవాఖానను పరిశీలించారు. ఆయన పర్యటన విషయం పోలీసు శాఖకు, ప్రజాప్రతినిధులకు ఎక్కడా సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. మండల పరిధిలో ప్రభుత్వం పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తున్న తరుణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పీఎస్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. లగచర్ల దాడి ఘటన తర్వాత అధికారులు ఏ అధికారి లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచర్లకుంట తండాలకు పోలీసులు రక్షణ లేనిదే వెళ్లడం లేదు. ఇందుకు ఉదాహరణ శుక్రవారం హకీంపేట్‌లో తహసీల్దార్ ఏర్పాటు చేసిన సమావేశమే. ఈ సమావేశానికి దాదాపుగా 20 మంది వరకు వివిధ పోలీసులు వచ్చారు. భూములు తీసుకునేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడంతో మరింత రక్షణ అవసరం అని భావించి పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు మొదలు పెట్టారు. త్వరలోనే తాత్కాలికంగా ఏదో ఒక చోట పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



ఘటనాస్థలిలో లచ్చయ్య మృతదేహం

ఇబ్రహీంపట్నం: బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొహెడ క్రాస్ రోడ్డు సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా నాంపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల లచ్చయ్య(60) కూలీ పని చేసి జీవనం సాగిస్తూ తుర్కయంజాల్‌లో నివాసముంటున్నాడు. స్నేహితుడైన కుమార్‌తో కలిసి వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌పై మంగల్‌పల్లికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో కొహెడా క్రాస్ రోడ్డు వద్ద వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వెనకాల కూర్చున్న లచ్చయ్య కింద పడి తలకు బలమైన గాయమైంది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. బైక్ నడుపుతున్న కుమార్‌కు సైతం స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

నూనె గింజల సాగుతో లాభాలు

సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్

- తిర్మలాపూర్‌లో కుసుమ పంటను పరిశీలించిన ఒడిశా రైతుల బృందం
- సాగు విధానాలపై అధ్యయనం



క్షేత్రస్థాయి పర్యటనలో ఒడిశా రైతుల బృందం

షాబాద్: నూనె గింజల సాగులో రైతులు అధిక దిగుబడులు సాధించేలా సూచనలు, సలహాలు ఇస్తున్నామని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, టెక్నీషియన్ నందీశ్వర్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామంలో భారతీయ నూనె గింజల సంస్థ సహకారంతో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుగుణమాల రైతు ఉత్పత్తి దారుల సంఘం ద్వారా రైతులు సాగు చేస్తున్న తెల్ల కుసుమ పంటను ఒడిశా రైతు బృందం సందర్శించింది. పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో తెల్ల కుసుమ పంటను క్షేత్రస్థాయిలో ఒడిశా రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఒడిశాలో నూనె గింజల సాగు మెరుగు పరచడానికి ఆధునిక విధానాలపై రైతు శిక్షణ అనే అంశంపై భారతీయ నూనె గింజల సంస్థ(రాజేంద్రనగర్)కు వచ్చామన్నారు. సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం చేస్తున్న కార్యక్రమాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. తిర్మలాపూర్ గ్రామంలో రైతులు సాగు చేస్తున్న బ్రోక్కోలి, క్యారెట్, వివిధ రకాల కూరగాయ పంటల సాగు తీరును రైతుల ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ అధికారి రోహన్, బిస్వాబాస్ కరిమ్, బ్లాక్ కో-ఆర్డినేటర్, రైతు సంఘం అధ్యక్షులు లింగం, రైతులు మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, అనంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.